

# కథా కౌముది

## అడుగు జాడలు

- సుశీల

### కౌముది-రచన నిర్వహించిన పోటీల్లో ఎంపికైన ఉత్తమ కథ

**ఆకుపచ్చ పరికిణీ** వేసుకున్న భూదేవిని పచ్చ బంతిపూల పసుపుతోనూ, ఎర్రబంతిపూల కుంకుమతోనూ అందంగా అలంకరించిన ఊరది. భూదేవి నడుము చుట్టూ తెల్లటి ఓణీలా, ఊరిని చుట్టుకుని ప్రవహిస్తున్న చల్లటి గోదారి. తూరుపు తెలతెలవారుతోంది. మామిడి చెట్టుమీద పక్షుల కిల కిల పాటలకి గోదావరి గలగలల తాళం వేస్తోంది. గట్టుమీద కోవెల్లోంచి సుప్రభాతం మంగళకరంగా వినిపిస్తోంది. గుడిగంట వంతపాడుతోంది.

కానీ, గోదావరి రేవు దగ్గర దిగాలుగా కూర్చున్న ఆ పదమూడేళ్ళ కుర్రాడి మనస్సులో మాత్రం భయంకరమైన నిశ్శబ్దం. రోజూ మనసుని తాకే కోవెల గంట ఆ రోజు వినిపించటం లేదు. తండ్రి కోపం పోగొట్టాలని, ఎలాగైనా మాట్లాడించాలని, ముందు రోజునుంచీ అతడు పడుతున్న తాపత్రయం అంతా ఇంతా కాదు. తన్నుకు వస్తున్న ఏడుపు ఆపుకుంటూ తండ్రినే గమనిస్తున్నాడు.

అతడి తండ్రి గౌరీనాధశాస్త్రి. పిలక ముడి విప్పి నీటిలోకి మునిగాడు. ఆయన ఒంటికి రాసుకున్న వీభూతి తెల్లగా నీటిపైన తేలింది. మూడు మునకలేసి పైకి లేచి, ఏదో మంత్రం జపిస్తూ, ఒళ్ళు రుద్దుకోవడం మొదలు పెట్టాడు. ఇదే అదను అనుకుని ఆ కుర్రాడు తండ్రి వెనక్కి చేరాడు. రోజూ ఆయన స్నానం చేస్తుంటే వీపు రుద్దటం అతడికి అలవాటు. ఆ ఉద్దేశ్యాన్ని గమనించిన తండ్రి, అతడికి అందకుండా గట్టువైపు జరిగి స్నానం చేయటం మొదలు  పెట్టాడు.

నిత్యమూ నీళ్ళుపోయించుకుంటూ భాగవతం పద్యాలు కమ్మగా పాడి వినిపించే నాన్న మాట్లాడటం లేదు. ఆ కుర్రాడికి రేవు బోసిపోయినట్టు అనిపించింది. పట్టుదల పెరిగింది. ఎలాగైనా నాన్నని మాట్లాడించాలి! చప్పున ఒక ఆలోచన వచ్చి, నీళ్ళలోంచి లేచి ఒడ్డుకొచ్చి మెట్టుమీద కూర్చున్నాడు. క్రితం వారం తండ్రి నేర్పిన ప్రబంధంలో పద్యాన్ని గొంతు విప్పి కమ్మగా పాడటం మొదలుపెట్టాడు!

జలజాతాసన వాసవాది....సురపూజా.....భాజనంబై తనర్చు,

లతాంతా...అc...యుధు కన్న తండ్రి శిరమచ్చో......

వామపాదంబునన్...... తొలగం "తన్నె"......లతాంగి.......

"తన్నె" అనే పదాన్ని ఒత్తిపలుకుతూ తండ్రికేసి చూశాడు.

అతడికి తెలుసు...ఆ పద్యంలోని అందమంతా "త్రోచె.." అనే పదంలో ఉందని... ఆ మాట కోస్తే ఆ ప్రబంధం పుట్టుకకే మూలం ఆ పదం. దాన్ని తప్పుగా పలికితే తండ్రి సహించడు. కనీసం తిట్టడానికైనా మాట్లాడతాడని ఆశ. ఆయన మాత్రం పెదవి విప్పలేదు. కనుకొలుకుల్లోంచి కొడుకుని ఒక్కసారి చూశాడు. అదికూడా క్షణంలో వెయ్యోవంతు సమయం. అంతే! నీటిలోంచి చరచరా పైకొచ్చి, గట్టుమీదకి నడిచాడు. కుర్రవాడు నిస్సహాయంగా చూస్తూ ఉండిపోయాడు. ఆయన క్రిందకి వంగి, గట్టుమీద మట్టిని భక్తిగా తీసుకుని నుదిటి మీద మూడు వీభూతి రేఖల్లా దిద్దుకుని ఊరివైపు నడవటం మొదలు పెట్టాడు.

కుర్రాడి చేయి అప్రయత్నంగా చెంపమీదకి వెళ్ళింది. ముందురోజు తండ్రి కొట్టినప్పుడు పడిన వేళ్ళ ముద్ర, చెంప మీద మూడు కుంకుమ రేఖలు తీర్చిదిద్దినట్టుంది. తెలుగులో నూటికి పద్దెనిమిది మార్కులు వచ్చినందుకు తండ్రి కొట్టిన దెబ్బది. ఆ దెబ్బకన్నా తండ్రి మౌనమే అతణ్ణి ఎక్కువ బాధ పెడుతోంది. ఆయనకి అంత కోపం రావడం అతనెప్పుడూ చూడలేదు. అలాగని అతడు తక్కువ కుర్రాడేం కాదు. ఆ వయస్సుకే తెలుగు కావ్యాలు, ప్రబంధాలు, శతకాల్లో పద్యాలన్నీ నిద్రలోలేపి అడిగినా అప్పచెప్పగలిగే దిట్ట. అసలు తెలుగులో అంత తక్కువ మార్కులు ఎలా వచ్చాయో అతడికే అర్థం కాలేదు. మాస్టారిని అడుగుదామంటే ధైర్యం చాల్లేదు.

ఊరిలోకి ప్రవేశిస్తుంటే ఎదురుగా ఆహ్వానిస్తూ మర్రిచెట్టు! గలగలమని అప్పటివరకూ గోలచేస్తున్నదల్లా వాళ్ళ మధ్య మౌనానికి భయపడినట్టు నిశ్శబ్దంగా ఆగిపోయింది. గాలికి ఊగిసలాడే కొమ్మలు మౌనంగా తలలు వంచాయి. సరిగ్గా అరుగు దగ్గరకి రాగానే, అరుగు మీద కూర్చున్న తెలుగు పంతులుగారు ఎదురయ్యారు. కుర్రాడు చటుక్కున తలదించుకున్నాడు. తక్కువ మార్కులు వచ్చింది ఆయన సబ్జక్టులోనే!

"ఏరా నన్నయ్య శాస్త్రీ! స్నానం పూర్తయిందేమిట్రా వెధవాయ్" అంటూ పలకరించారు. కొంచెం వెనకగా వస్తున్న గౌరీనాధశాస్త్రిగారిని చూసి, అరుగు మీంచి దిగి, "నమస్కారం శాస్త్రులుగారూ! బాగున్నారా?" అనడిగారు.

గౌరీనాధశాస్త్రి చిరునవ్వు నవ్వుతూ "పిల్లలంతా కులాసాయేనా పంతులుగారూ?" అంటూ ఆప్యాయంగా అడిగారు. "ఓ...భేషుగ్గా ఉన్నారండీ.... ఇదిగో మీవాడి విషయం ఒకటి చెప్దామని..." అర్థోక్తిలో ఆపారు. కుర్రాడి మొహం పాలిపోయింది. అంతలో గౌరీనాధశాస్త్రి అందుకుని "తెలుగు మార్కులు గురించేగా పంతులుగారూ? ఈసారి నేను దగ్గరుండి చదివిస్తాలెండి" అన్నారు. చెపుతుంటే తండ్రి మొహం అవమాన భారంతో క్రుంగిపోవడం గమనించి కుర్రాడు చలించిపోయాడు.

అదిగమనించిన పంతులుగారు కంగారుగా "అయ్యో దానిగురించేనండీ. చిన్న పొరపాటు జరిగిపోతేను..." అన్నారు. తండ్రీ కొడుకులిద్దరూ పంతులుగారి వైపు అయోమయంగా చూశారు.

"మన తరగతిలో ఇంకొక కుర్రాడున్నాడు లెండి.... వాడి పేరు అప్పాభట్ల నారాయణ శాస్త్రి. మనవాడేమో ఆదిభట్ల నన్నయ్య శాస్త్రి. ఇద్దరూ ఎ.ఎన్.శాస్త్రి అని రాసేసరికి పొరపాటున మార్కులు తారుమారయ్యాయి. ఒకడికి ఎనభై రెండూ, ఇంకొకడికి పద్దెనిమిదీనూ... ఆ నారాయణగాడికి ఎనభైలు ఎలా వచ్చాయా అని నిన్న రాత్రి మనసు పెట్టి చూస్తే అప్పుడు తెలిసిందండీ. వెధవ రాతా వాడూనూ... వాడి జన్మకి అన్ని మార్కులు కూడానా? ఆ పేపరు మనవాడిది సుమండీ!"

కుర్రాడు విప్పారిన నేత్రాలతో తండ్రి వంక చూశాడు. తండ్రి మొహంలో ముందు రోజునుంచీ ఉన్న కోపం కరిగిపోయి ఆ స్థానంలో వాత్సల్యం చోటు చేసుకుంది. అది చూసి అతడికి ఎగిరి గంతెయ్యాలన్నంత సంతోషం వేసింది. ఆ సంతోషంలో వాళ్ళిద్దరూ పంతులుగారు వెళ్ళిపోయిన విషయమే గమనించలేదు.

గౌరీనాధ శాస్త్రికొడుకుని తీసుకెళ్ళి అరుగు మీద కూర్చోపెట్టి పక్కనే కూర్చుని అతడి తల ఆప్యాయంగా నిమిరాడు. అప్పటిదాకా తండ్రి మాట్లాడలేదని తల్లడిల్లిపోయినవాడు కాస్తా, ఆయన స్పర్శకి పులకించిపోయాడు.

రెండు నిముషాల పాటు వాళ్ళిద్దరి మధ్యలో మాటలు కరువయ్యాయి.

చివరకు ఆయనే అతి కష్టం మీద గొంతు పెగుల్చుకుని "ఒరేయ్ అబ్బాయ్. నిజం తెలుసుకోకుండా నిన్ను తొందరపడి కొట్టాన్రా! నన్ను క్షమించవూ?........" అన్నాడు గంభీరంగా!

*ఏ తప్పూ చేయకుండా ఉండడం గొప్పవిషయమే! దానికి ఎంతో సంస్కారం కావాలి! కానీ చేసిన తప్పుని సిగ్గుపడకుండా ఒప్పుకుని, అవసరమైతే పసిపిల్లాడికైనా క్షమాపణ చెప్పగలగడానికి మరింత సంస్కారం కావాలి. అది సాధించడం ఇంకా గొప్ప విషయం.*

ఆయన వ్యక్తిత్వానికి కొడుకు చలించిపోయాడు. వెక్కి వెక్కి ఏడుస్తూ తండ్రిని అల్లుకుపోయి గద్గదమైన స్వరంతో "నువ్వు నాకు క్షమాపణ చెప్పడమేంటి నాన్నా! నీ దెబ్బలు కూడా నాకు దీవెనలే" అన్నాడు.

జీవితంలో ఎన్నో ఢక్కా మొక్కీలు తిన్న ఆయనకే కళ్ళల్లో నీళ్ళు తిరిగాయి. అతడి చెంపమీద పడిన వేలి గుర్తులని ఆప్యాయంగా తడుముతూ "సరేరా! అబ్బాయ్! జరిగిందేదో జరిగిపోయింది కానీ ఇంకెప్పుడూ నీ పేరు ఎన్. శాస్త్రి అని రాయకురా! చక్కగా "నన్నయ్య శాస్త్రి" అని రాస్తూండు. గొప్ప ఆశయంతో నీకా పేరు పెట్టాను. నువ్వు సాధించాల్సింది చాలా ఉందిరా." అన్నారు.

చెపుతుంటే ఆయన గొంతు ఆవేదనతో సన్నగా వణకటం అతడు గమనించాడు. కళ్ళు తుడుచుకుంటూ "సరే నాన్నా! కానీ ఈసారి కోపం వస్తే మాత్రం, నన్ను కొడితే కొట్టుగానీ మాట్లాడటం మానేయకు నాన్నా. అది నాకు భయంకరమైన శిక్ష" అన్నాడు జాలిగా!

ఆయన చిరునవ్వు నవ్వుతూ గంభీరంగా అరుగుమీంచి లేచారు.

మర్రిచెట్టు సంతోషంతో మళ్ళీ అల్లరి చేయడం మొదలు పెట్టింది.

"వాట్ ద హెల్ ఆర్ యూ థింకింగ్ మిస్టర్ శాస్త్రీ...?"

పోలీస్ అధికారి అరుపుతో కళ్ళముందు కదులుతున్న చిన్ననాటి జ్ఞాపకమంతా కరిగిపోయి ఈ లోకంలోకి వచ్చాడు నన్నయ్య శాస్త్రి. కళ్ళు తుడుచుకుంటు చుట్టూ చూశాడు...... గోదావరీ లేదు, మర్రి చెట్టూ లేదు! న్యూయార్క్ మహానగరం నడిబొడ్డున ఉన్న పోలీస్ స్టేషన్‌లో తను, పక్కనే కర్కశంగా చూస్తూ నిలబడ్డ ఇద్దరు కాప్స్.

"మిస్టర్ శాస్త్రీ! కూతురు వ్యక్తిగత జీవితంలో కల్పించుకునే అధికారం నీకు లేదు. అందులోనూ ఆమెని కొట్టడం మహా నేరం. మీ అమ్మాయి, తనే కేసు విత్‌డ్రా చేసుకోబట్టి రెండురోజుల జైలుతో సరిపోయింది కానీ లేకపోతే ఆరునెల్లకి తక్కువకాకుండా నువ్వు జైల్లో ఉండాల్సి వచ్చేది" పోలీస్ అధికారి ఇంగ్లీషులో నిర్దాక్షిణ్యంగా చెప్పాడు.

అది విని కూతురు కిసుక్కున నవ్వడం చూసి చప్పున అటువైపు చూశాడు నన్నయ్య శాస్త్రి.

అతడి పదేళ్ళ కూతురు మందాకిని దూరంగా నడుం మీద చేతులేసుకుని నిర్లక్ష్యంగా నిలబడి ఉంది. పక్కనే అతడి భార్య. ఆమె కళ్ళల్లోనూ అదే నిర్లక్ష్యం!

అతడు ఉండబట్టలేక "అది కాదుసార్! రోడ్డు పక్కన కారాపి, అందులో కూర్చుని బోయ్ ఫ్రెండ్‌తో సరసాలాడుతుంటే చూడలేక కొట్టాను" అన్నాడు ఆవేదనగా!

"సారీ! తండ్రిగా ఆమెని పోషించడం వరకే నీ బాధ్యత. కొట్టే అధికారం నీకివ్వలేదు. మళ్ళీ ఎప్పుడైనా ఆమెని హింసించినట్టు తెలిస్తే, ఈసారి నిన్ను జీసస్ కూడా కాపాడలేడు. ఇంక వెళ్ళచ్చు" అన్నాడు చిరాగ్గా!

భార్యా, కూతురు అప్పటికే పోలీస్ స్టేషన్ గుమ్మం దాటుతున్నారు. అతడు చేసేదేమీ లేక నిస్సహాయంగా కుర్చీలోంచి లేచాడు. రెండు రోజుల్నుంచీ తిండి, నిద్ర లేకపోవటం వల్ల చాలా నీరసంగా ఉందేమో, ముందుకి తూలిపడబోయాడు. వెళ్ళిపోబోతున్న కూతురు ఒక్కసారి గుమ్మం దగ్గర ఆగి, పరుగెత్తుకుని వెనక్కి వచ్చింది.

అతడు ఆశ్చర్యంతో ఆమె వేపు చూశాడు. తను తూలి పడబోతుంటే పట్టుకోడానికి వచ్చిందనుకుని అతడి కళ్ళు ఆనందంతో మెరిశాయి. కానీ ఆ ఆనందం ఒక్క క్షణం కూడా నిలవలేదు. ఆమె తిన్నగా పోలీస్ దగ్గరకి వెళ్ళి "థాంక్యూ అంకుల్! యు సేవ్డ్ మై లైఫ్" అంటూ షేక్ హ్యాండ్ ఇచ్చింది.

పోలీస్ సంతోషంగా "ఇట్స్ ఆల్‌రైట్ బేబీ! మళ్ళీ ఇలాంటి ప్రాబ్లమ్స్ వస్తే ఇదే నెంబర్‌కి ఫోన్ చేసి కంప్లైంట్ ఇవ్వు."

నన్నయ్య శాస్త్రి నిరాశగా నవ్వుకుంటూ వెళ్ళి కారులో కూర్చుని డ్రైవ్ చేయడం మొదలు పెట్టాడు. భార్య, కూతురు వెనక సీట్లో కూర్చునున్నారు. వాళ్ళ పెదాలపైన ముసి ముసి నవ్వులూ, కళ్ళల్లో పైశాచిక ఆనందం రేర్‌వ్యూ మిర్రర్ లోంచి కొట్టొచ్చినట్టు కనిపిస్తున్నాయి.

చాలా సేపు నిశ్శబ్దం. అతడు భరించలేకపోయాడు. చివరికి అతి కష్టమ్మీద నోరు విప్పి, "నన్ను క్షమించు మందాకినీ!" అన్నాడు.

"నిన్నెప్పుడో క్షమించా డాడ్! బట్ ఆ బ్లడీ ఓల్డ్ నేమ్‌తో నన్ను పిలవద్దని ఎన్నిసార్లు చెప్పాలి? చక్కగా మనీ అని పిలవచ్చుగా" అంది గొంతు చించుకుంటూ.

"మీ నాన్నతో వచ్చిన దరిద్రం అదే బేబీ "అంటూ భార్య అతడి వైపు తిరిగి" దాని పేర్లో ఫస్ట్, లాస్ట్ లెటర్స్ కలిపి "మనీ" అని లవ్లీగా పిలవమంటే నీకు బుర్రకెక్కదా డాళింగ్?" అంది.

అతడికి ఒళ్ళుమండిపోయింది! "దానికి బదులు మొదటి అక్షరం, మూడో అక్షరం కలుపుకోవలిసింది. ఇంకా మంచి పేరొచ్చేది" అన్నాడు కసిగా........

మందాకినికి అదేమిటో అర్ధంకావడానికి రెండు నిమిషాలు పట్టింది. ఆమె మొహం ఎర్రగా కందిపోయింది. ఉక్రోషంగా "ఇదే డాడీతో వచ్చిన హెడేక్! పోనీ కదాని జైల్లోంచి బయటికి తీసుకొస్తే ఇలాంటి చెత్త సెటైర్లు వేసి చంపుతాడు" అంది, "చంపుతాడు" అనే ఆ పదంలోని "చ" కారాన్ని, చాలా ఫ్యాషన్‌గా పలుకుతూ.. వెంటనే తల్లి అందుకుని "యు ఆర్ రైట్ బేబీ! తెలుగు బాగా వచ్చని మీ నాన్నకి పొగరు. ఇంకొక్క రెండురోజులు జైల్లో ఉండుంటే ఆ పొగరంతా దిగేది" అంది. ఆ మాటకి మందాకిని పగలబడీ నవ్వింది.

అతడి మనస్సు చివుక్కుమంది. ఏమీ మాట్లాడకుండా డ్రైవ్ చేస్తున్నాడు.

కారు ఎయిర్ పోర్ట్ గోడ పక్కనుంచి నెమ్మదిగా వెళుతోంది. అతడికి వెంటనే తండ్రి గుర్తుకొచ్చాడు. ఒక ఉన్నతాశయంతో చిన్నప్పటినుంచీ తనని, కుండీలో వేసిన మొక్కలాగా అపురూపంగా పెంచుకున్న తండ్రి. తను అమెరికాలోనే సెటిలైపోతానని చెప్పినప్పుడు, మనస్సులో ఎన్ని అగ్నిపర్వతాలు బ్రద్దలవుతున్నా, చెదరని చిరునవ్వుతో అంగీకరించిన గొప్ప వ్యక్తిత్వం కల తండ్రి!

ఏది మంచో ఏది కాదో అర్ధమయ్యేలా చెప్పి, నిర్ణయాన్ని మాత్రం తనకే వదిలేసే మంచి మిత్రుడిలాంటి తండ్రి! అమెరికా వచ్చేస్తుంటే వీడ్కోలు చెప్పడానికి ఎయిర్ పోర్ట్‌కొచ్చి, అద్దాల వెనకనుంచి దీనంగా చేయూపిన తండ్రి!

అతడికి కళ్ళల్లో అప్రయత్నంగా నీళ్ళు తిరిగాయి. ఏదో అతీతమైన శక్తి తన్ని ఆప్యాయంగా పిలుస్తున్నట్టు అనిపించింది. కారు స్లో చేసి, రోడ్డువారగా ఆపాడు. కార్ డాష్ బోర్డులోంచి పాస్ పోర్ట్, క్రెడిట్ కార్డ్స్ తీసుకుని నెమ్మదిగా క్రిందకి దిగాడు.

"వేర్ ఆర్‌యూ గోయింగ్?" మందాకిని అడిగింది.

అతడు సమాధానం చెప్పలేదు. ఆవుని చేరుకోబోయే లేగదూడ కళ్ళల్లో తొణికిసలాడే ఆనందం ఆ క్షణం అతడి కళ్ళల్లో వ్యక్తమౌవుతోంది.

కూతురి అనుమానాన్ని గుర్తించిన అతడి భార్య "ఎక్కడికీ పోడులే బేబీ! ఒకవేళ బ్లడీ సెంటిమెంట్స్‌తో పోయినా, మళ్ళీ తిరిగి వస్తాడులే! నువ్వేమీ కంగారు పడకు" అంటూ ముందు సీట్‌లోకి వచ్చి కారు స్టార్ట్ చేసింది.

అతడు చిరునవ్వు నవ్వుకుంటూ ఎయిర్ పోర్ట్‌లోకి నడిచాడు.

❀ ❀ ❀

పోస్ట్ మాస్టర్ గేటు తీసుకుని ఇంట్లోకి రావడం చూసి అన్నపూర్ణమ్మ మొహం చాటంతయ్యింది. ఒక్క ఉదుటన లేచి వీధిలోకి పరుగెత్తింది.

మంచానికి అతుక్కుపోయున్న గౌరీనాధ శాస్త్రి ఆ శబ్దానికి నీరసంగా కళ్ళు తెరిచి చూసి, సత్తువలేనట్టు మళ్ళీ నిద్రలోకి జారుకున్నాడు. తెరచిన ఆయన నిర్జీవమైన కళ్ళవెనుక దిగులు చూసి, ఆయన అరికాళ్ళకి లేపనం పట్టిస్తున్న వైద్యుడు ఆచారి మనస్సు చివుక్కుమంది.

"ఫోన్ చేశారా మాష్టారు?" ఆవిడ ఆదుర్దాగా అడిగింది. పోస్ట్ మాస్టర్‌కి ఏం చెప్పాలో అర్థంకాలేదు. రెండు నిముషాలు ఆలోచించి నెమ్మదిగా అన్నాడు.... "లేదమ్మా! ఆ అమెరికా నంబరు మూడురోజులనుంచీ ట్రై చేస్తూనే ఉన్నాను. ఎవ్వరూ ఎత్తట్లేదు!"

"మరి వాడి ఆఫీసు నెంబరు కూడా ఇచ్చాను కదా మాస్టారూ?" ఆవిడ ఆశగా అంది.

"అది కూడా ప్రయత్నించాను తల్లీ! ఆఫీసుకి రావట్లేదట!"

ఆమె భారంగా వదిలిన నిట్టూర్పు ఆయనకి స్పష్టంగా వినిపించింది. వారంరోజులనుంచీ కంటిలోకి తొంగిచూడని నిద్ర ఆమె కళ్ళక్రింద చారలు కట్టి కనిపిస్తోంది. ఆమె బాధని అర్థం చేసుకున్న మాస్టారు "ఈ -మెయిలు పంపమని మా కుర్రాణ్ణి పట్నం పంపాలేమ్మా! " అన్నాడు.

"అది పంపితే వచ్చేస్తాడంటారా?"

"నా ప్రయత్నం నేను చేస్తానమ్మా! ఇంతకీ శాస్త్రిగారికి ఎలా ఉంది?"

ఆ ప్రశ్నకి ఆమె బావురుమంది. "వాణ్ణి చూడాలనే తపన ఆయన కళ్ళల్లో కనిపిస్తోంది మాష్టారూ! ఎలాగైనా వాడికి ఫోన్ చేసి వెంటనే రమ్మని చెప్పండి!" అంటూ ఏడుస్తూ లోపలికెళ్ళిపోయింది.

ఆమె అటెళ్ళగానే అప్పటివరకూ వరండాలో నుంచున్న చుట్టుపక్కల వాళ్ళు ఒకచోట పోగయ్యారు.

"నాకైతే ఇంక ఆశలేదోయ్ పోస్ట్ మాస్టరూ" అన్నాడు ఎదురింటి సుబ్బారావు సిగరెట్టు ముట్టించుకుంటూ.

అతడికి మొదటినుంచీ శాస్త్రిగారంటే పడదనే విషయం చాలామందికి తెలుసు.

మాస్టారు నెమ్మదిగా "మన ఆచారి హస్తవాసికి తిరుగులేదు సుబ్బారావు! ఇప్పుడైతే పరిస్తితి ఎటూ అర్థం కాకుండా ఉంది కానీ ఆచారి చెప్పిన దాని ప్రకారం సాయంత్రానికి నెమ్మదిస్తుందిట" అన్నాడు.

సుబ్బారావు వెటకారంగా నవ్వుతూ "ఇప్పుడేంటి లెండి. మొదట్నించీ కూడా ఈయన పరిస్థితి ఎటూ అర్థం కాకుండానే ఉంది. భాషన్నాడు, భాషాభిమానమన్నాడు. కొడుకునేమో ఇంగ్లీషు చదువులు చదివించాడు! నా తెలుగో, నా ఆంధ్రదేశమో అని ఓపికున్నన్నాళ్ళూ గొంతు చించుకున్నాడు. కొడుకుని అమెరికా పంపించాడు. వెరీ కన్‌ఫ్యూజింగ్ ఫెల్లో! అసలు ఆయన ఏం చేయదల్చుకున్నాడో ఆయనకే అర్థంకాదు" అన్నాడు, అక్కడ వేళ్ళాడుతున్న బోర్డుకేసి చూస్తూ.

"తెలుగు భాషాభిమాన సంస్థ" అనే బోర్డు ఆ ఇంటిముందు చూరుకి వేళ్ళాడుతోంది. పాతదైపోవడం వల్ల దానికి ఒక వైపు తాడు తెగిపోయి వచ్చే పోయే వాళ్ళ తలలకి తగులుతోంది.

పక్కింటి సుందరం గొంతు సవరించుకుంటూ "శాస్త్రిగారు ఏం చేశారో విశ్లేషించేంత విజ్ఞత మనకి లేదోమోనని నా అనుమానం. ఆయన సాధించిన దానికి ఒక్క ఉదాహరణచాలు....... మొన్న మొన్నటివరకూ పిల్లల ఇంగ్లీషు రైమ్స్‌తో హోరెత్తిపోయిన మా ఇంట్లో ఈ మధ్య చక్కగా సుమతీ శతకం, వేమన శతకం వినిపిస్తున్నాయంటే అది ఆయన చలవే. అది సాధించడం కోసం ఆయన సొంత డబ్బు

ఖర్చు పెట్టి ఎన్ని స్కూళ్ళు తిరిగాడో, ఎంత మంది డి.ఈ.ఓల్ని బ్రతిమలాడాడో ఆ భగంతుడికే తెలుసు. తెలుగు దేశపు రాజధానిలోనే, "నాకు తెలుగే తప్ప హిందీ రాదు......" అనేవాళ్ళని గొర్రెల్లా చూస్తున్న ఈ కాలంలో, మన భాష నిలబడాలంటే శాస్త్రిగారి లాంటి మనుషుల అవసరం ఎంతైనా ఉంది....." అన్నాడు ఆవేశంగా!

గుంపులోంచి ఇంకొకాయన ముందుకొచ్చాడు. "అంతవరకూ ఎందుకోయ్ సుందరం, మన శాస్త్రిగారు వాలంటరీ రిటైర్ మెంటు తీసేసుకుని, పది మంది స్టూడెంట్లని ప్రోగు చేసి వాళ్ళకి తెలుగు కావ్యాల్లోనూ, ప్రబంధాల్లోనూ ఎంత ట్రైనింగ్ ఇచ్చారో మనందరికీ తెల్సున్న విషయమేగా.... వాళ్ళందరూ ఉద్యోగాలు ఎతుక్కుని తలో దిక్కూ పోయారు గానీ, లేకపోతే ఈ పాటికి మన ప్రాంతంలో తెలుగు భాష మార్మ్రోగిపోయేది కాదు!?"

సుబ్బారావు సిగరెట్టు పీక క్రింద పడేసి నిర్లక్ష్యంగా చూస్తూ "ఇంట గెలిచి రచ్చ గెలవమన్నారోయ్! ఊరిని ఉద్ధరించే ముందు ఆయన కొడుకుని ఆ ఇంగ్లీషు చదువులు చదివించకుండా, అమెరికా పంపకుండా ఉండాల్సింది. ఆయనే అలా చేశాక, ఇంక భాష గురించి ఆయన ఇచ్చే ఉపన్యాసాలకి విలువెక్కడుంటుందోయ్?" అన్నాడు

ఈలోపు ఆచారి ఇంట్లోంచి బయటకి వచ్చాడు. అప్పటివరకూ కబుర్లు చెప్పుకుంటున్న వాళ్ళందరూ అతడి చుట్టూ మూగారు. అందరిదీ ఒకటే ప్రశ్న. "శాస్త్రిగారికి ఎలా ఉంది ఆచారీ?" అని.

ఆచారి నడుముకు చుట్టుకున్న తువ్వాలు తీసి భుజం మీద వేసుకుంటూ, "ఇప్పుడే స్పృహలోకి వచ్చారు. ఆయన్ని ఎవ్వరూ పలకరించకండి. సాయంత్రందాకా ఏం చెప్పలేము. కాలమే నిర్ణయించాలి" అన్నాడు.

పోస్ట్‌మాస్టర్ నిట్టూరుస్తూ, "పరుగెత్తే ప్రవాహం క్రింద కనపడకుండా ఈదుకెళ్ళే చేప పిల్లలా కాలానికి తెలీకుండా కాలంతో కలిసిపోయి జీవించాడు. కాలమే నిర్ణయిస్తుందిలెండి! పదండి" అంటూ అందరితో పాటు బయటకి నడిచాడు.

గౌరీనాథ శాస్త్రి బరువుగా కళ్ళు తెరిచాడు. ఆయన ప్రాణాలు కళ్ళ కొసల్లో కొట్టుకుంటున్నాయి.

అన్నపూర్ణమ్మ ఆతృతగా వచ్చి ఆయన పక్కనే కూర్చుంది. ఆయన మాటిమాటికీ గుమ్మం కేసి చూస్తున్నాడు. ఆమె రాబోతున్న ఏడుపుని బలవంతంగా ఆపుకుంటూ "నీ బాధ నాకు తెలుసులేవయ్యా! వాడికోసమే కదూ.... వచ్చేస్తాడులే. మాస్టారు కబురు పెట్టారుట" అంది.

ఆయన నిర్జీవంగా నవ్వుతూ "వాడి గురించి నాకేం బాధలేదే! రెక్కలు వచ్చాయి, ఎగిరిపోయాడు. అది సహజమేగా" అన్నాడు గుమ్మం మీంచి చూపు మరల్చకుండా.

చూరికి వేళ్ళాడుతున్న బోర్డు గాలికి టపాటపా కొట్టుకుంటోంది.

ఆమె ఆయన చేతిని ఆప్యాయంగా తన చేతుల్లోకి తీసుకుని "అర్థమైందయ్యా, నీ తరువాత ఈ భాష ఉనికి ఏమౌతుందో అని బాధపడుతున్నావు కదూ" అంది.

ఆయన మూతపడుతున్న కనురెప్పల్ని బలహీనంగా పైకెత్తి శుష్కంగా నవ్వాడు. "వెర్రిదానా.....! భాష ఉనికిని కాపాడ్డానికి మనమెంతవారమే?.. చెట్టు తన రూపాన్ని పదిల పరుచుకున్నట్టే.. భాష కూడా తన మనుగడని తనే పరిరక్షించుకుంటుంది. "వస్తున్న దగ్గుతెరని బలవంతంగా ఆపుకున్నాడు........." ఎక్కడో లండన్ వాడైన బ్రౌన్ మహాశయుణ్ణి తన దగ్గరకి ఆకర్షించుకుని, శిధిలమైపోతున్న తన మనుగడని పునరుద్ధరించుకుందే! భాషకున్న శక్తిని తెలియచెప్పడానికి అంతకన్నా ఋజువేం కావాలే?.......

ప్రతి తరంలోనూ తనకోసం తీవ్రంగా తపించేవాళ్ళని భాష సృష్టించుకుంటూనే ఉంటుంది.

వాళ్ళ సంఖ్య పరిమితమే కావచ్చు కానీ ఆ యజ్ఞం నిరంతరాయంగా కొనసాగుతూనే ఉంటుంది"

"మరి ఇన్ని తెలుస్తున్న వాడివి, అబ్బాయిని ఆ ఇంగ్లీషు చదువులు ఎందుకు చదివించావయ్యా? అమెరికా పంపకుండా ఎంచక్కా మనదగ్గరే ఉంచుకోనుండాల్సింది" అందావిడ కళ్ళు తుడుచుకుంటూ..

ఆయన శ్వాస భారమౌతోంది. క్షణక్షణానికీ శక్తి సన్నగిల్లుతోంది. బలవంతంగా ఓపిక తెచ్చుకుని అన్నాడు... "భారతీయుడికి దేశ స్వాతంత్ర్యం వచ్చింది కానీ.......... భావ స్వాతంత్ర్యం ఇంకా రాలేదే!" ఆవిడ అర్థం కానట్టు చూసింది. "నేను పంచెకట్టుకుని... పిలక పెట్టుకుని.... మన భాష ఔన్నత్యం గురించి స్టేజీల మీద అరుస్తూ చెప్పినా.... జనం పట్టించుకోలేదు. అదే ఇంగ్లీషు చదువులు చదివినవాడో... అమెరికావాడో.... సూటూ బూటూ వేసుకొచ్చి చెపితే నోరెళ్ళబెట్టుకుని వింటారు మన జనం. అదేనే మన దౌర్భాగ్యం." ఆయన చేయి బలహీనంగా సాగి ఆమె చేతిని స్పృశించింది. శ్వాస క్షీణించింది. ఒక దివ్య జ్యోతి ఆయన మొహం మీద ప్రకాశించింది. "ఏదేదో చేయాలనుకున్నానే... కానీ.... ఏం చేయాలో, ఇప్పటి జనానికి ఏం కావాలో తెలుసుకోలేకపోయాను.... నేను ఈ తరం చదువులు చదువుకోకపోడమే దానికి కారణం. వాణ్ణి కూడా నాలా తయారుచేయడం ఇష్టంలేకే... అలా పెంచానే" అన్నాడు, ఉబికి వస్తున్న కన్నీటిని దిగమింగుకుంటూ.

ఆవిడ గుండె కరిగిపోయింది. "ఇన్ని తెలుసున్న నువ్వే బాధపడితే ఎలాగయ్యా? నాల్రోజులు చూడు... వాడే వస్తాడులే"

ఆఖరి శ్వాస ఆయన గుండెల్లోంచి ప్రకంపించింది.....

"వాడు రాలేదని కాదే నా బాధ. వాడు కాకపోతే ఇంకొకడు....

అస్తమిస్తున్న సూర్యుణ్ణుంచి.... ఆలయంలో చిన్న దీపం.....స్ఫూర్తిని తీసుకుని.... ప్రకాశించినట్టు, నేలకొరుగుతున్న... చెట్టునుంచి, నేలలో నాటుకుంటున్న.... విత్తనం ... బాధ్యత... తీసుకున్నట్టు, నా చేతిలో వెలిగే జ్యోతిని ఆరిపోయేలోపే వేరొకళ్ళు అందుకోవాలి....

ఆరిపోబోయే కాకరపువ్వొత్తికి....

ఇంకొకదాన్ని తాకించి వెలిగించడం చాలా తేలిక....

అలాకాకుండా.... మొదటినుంచి... వెలిగించాలంటే...

చాలా............స.............మ.........యం............"

గుమ్మం దగ్గర వినపడిన బూట్ల శబ్దానికి అన్నపూర్ణమ్మ తలెత్తి చూసింది.

నన్నయ్య శాస్త్రి నడుచుకుంటూ లోపలికి వస్తున్నాడు. గుమ్మంలోకి అడుగుపెడుతుంటే చూరుకి వేళ్ళాడుతున్న బోర్డు అతడి తలకి బలంగా తగిలింది. రెండడుగులు వెనక్కి వేసి పైకి చూశాడు. ఒక్క క్షణం ఆలోచించి పక్కనే ఉన్న కొబ్బరాకు తుంపి, ఆ బోర్డుని జాగ్రత్తగా చూరుకి కట్టాడు. జేబులోంచి కర్చీఫ్ తీసి దాని మీద పేరుకు పోయిన మట్టిని శుభ్రంగా తుడిచి ఇంట్లోకి అడుగు పెట్టాడు.

అన్నపూర్ణమ్మ ఆనందంతో "చూడవయ్యా చూడు, మనవాడు వచ్చేశాడు. నేను చెప్పలేదూ" అంటూ భర్తకేసి చూసింది...

అప్పటికే ఆయన చూపు నిలిచిపోయింది!....

కానీ, ఏదో అపురూప దృశ్యాన్ని చూసినట్టు, మూతపడ్డ పెదాలమీద ఆఖరి చిరునవ్వు మాత్రం అలాగే ఉంది.....!!

జయంతితే సుకృతినో రససిద్ధాః కవీశ్వరః - నాస్తి తేషాం యశఃకాయే జరామరణజం భయం



ఆంధ్ర దేశంలో పుట్టినా సరే, తెలుగు సరిగ్గా రాని పిల్లల్నీ, వాళ్ళకి మాతృభాష నేర్పాలనే ఆరాటం ఎంతమాత్రం లేని వాళ్ళ తల్లి దండ్రుల్నీ ఎంతోమందిని చూశాను. అలాంటి వాళ్ళని చూసినప్పుడు కలిగిన ఆరాటానికి ప్రతిరూపమే ఈ కథ. పాశ్చాత్య భాషా ప్రభావమనే పెనుతుఫానుకి రెపరెపలాడుతున్న మాతృభాషాభిమాన జ్యోతిని కాపుకాయడానికి, తమ జీవితాలని ధారపోస్తున్న తెలుగుతల్లి ముద్దు బిడ్డలందరికీ ఈ కథ అంకితం. నా ఆలోచనకి రూపనిర్దేశం చేసిన నా భర్త నండూరి శ్రీనివాస్ కి, బహుమతి నిచ్చి ప్రోత్సహించిన కౌముది-రచన వారికి నా కృతజ్ఞతలు. - నండూరి సుశీల